# 11

# కుశాగ్ర బుద్ధి

తెల్లవారు ఝామున నాలుగు గంటలు అయింది. డోర్ బెల్ మోగింది. లేచి తలుపు తీశాను. ఎదురుగా వాచ్‌మెన్.

"అమ్మా రాజారావుసార్ పోయారట అన్నాడు. బిల్డింగ్‌కి మావారు ప్రెసిడెంట్. ఈ సందడి విని లేని వచ్చేశారు. మరోసారి ఆ విషయమే ఆయనతో చెప్పాడు వాచ్‌మెన్.

"సరే నువ్వెళ్ళి నలుగురికీ చెప్పు నేవస్తున్నా" అన్నారు. పదినిమిషాల్లోనే అందరికీ తెలిసిపోయింది ఈ వార్త. అందరూ కింద సెల్లార్‌లోకి వెళ్ళారు. మరి కాసేపట్లో బాడీ తీసుకొస్తారు. కాబట్టి కింద కొన్ని కార్లు తీయించి బయట పెట్టించారు.

ఏడుకాకముందే అంబులెన్స్ వచ్చేసింది. బాడీ వచ్చేసింది అందులో. వెంట కుటుంబసభ్యులు. రాజారావుగారికి వయసేమంత లేదు. ఇంకా ఏభై నిండలేదు. లివర్ పాడైపోయింది. ఆర్నెల్లక్రితం పరిస్థితి చెయ్యి జారిపోయిందని తెలిసింది.

మరీ రెండునెలలనించీ హాస్పిటల్‌కి వెళ్ళనూ రానూ.

ఆయన చిన్నవాడే కాబట్టి అక్కడి పరిస్థితి అంతా అయోమయంగా వుంది. పక్షిలా ఏడుస్తున్న భార్య. ఎనభై ఏళ్ళ తండ్రి, డెబ్భై ఏళ్ళ తల్లి. ఎటుపోయి ఎటువస్తుందో అని తొందరపడి ఓ జందెంపోగు వేయించిన పదిహేనేళ్ళ కొడుకు. పద్ధెనిమిదేళ్ళ కూతురు.

మిగిలినవారంతా బంధువులే. బయటివాళ్ళే.

పోయినవాడు పోయాడు. మిగిలిన కార్యక్రమం నడవాలిగా. కాసేపు చూసి బిల్డింగ్ వాళ్ళే లేచారు. బంధువులని అడిగితే “అవునవును. ఊళ్ళనించీ రావలసిన వాళ్ళెవరూ లేరు. కానిచ్చెయ్యాలి” అన్నారేగాని ఎవరూ కదల్లేదు.

బిల్డింగ్ సెక్రటరీగారి తండ్రి ఈ మధ్యనే పోయారు. అప్పుడు కార్యక్రమం జరిపించిన జగన్నాథం నెంబరుంది ఆయన డైరీలో. మీరు ఆయన్తో మాట్లాడండి అన్నారు. ఫోన్‌చేస్తే ఆయనప్పుడు వేరే పనిలో ఉన్నాడట. మా వాళ్ళని పంపిస్తాను అన్నాడట.

ఆడవాళ్ళం కాసిని కాఫీతెచ్చి అక్కడున్నవాళ్లందరికీ ఇచ్చాం. వాళ్ళకి ధైర్యం చెప్తూ అక్కడే కూర్చున్నాం.

ఓ పాత బజాజ్ స్కూటర్ వచ్చి గేటుదగ్గర ఆగింది. పదిహేడేళ్ళ కుర్రాడు నడుపుతున్నాడు. వెనకాల పధ్నాలుగేళ్ళ కుర్రాడు కూర్చుని వున్నాడు. ఇద్దరూ నీరుకావి పట్టిన పంచె, నలిగిన షర్టు భుజంమీద తుండుగుడ్డా ధరించి వున్నారు.

“ఎవరండీ ఫోన్ చేసింది? మమ్మల్ని జగన్నాథంగారు పంపించారు. మేము వారి కొడుకులం” అన్నాడు చిన్నకుర్రాడు.

ఎగాదిగా అతనివంక చూశారందరూ. నీ పేరేమిటబ్బాయ్ అని అడిగారు ఓ పెద్దాయన. “బాలక్రిష్ణ” అన్నాడతను. “చూడు నాయనా! ఇదేం వాహనపూజ, పుణ్యాహవచనం కాదు. ఇలాంటి పనులకి కాస్త వయసూ అనుభవం ఉన్నవాళ్ళని పంపించాలిగానీ, పసివాళ్ళను పంపిస్తారుటయ్యా!” అన్నాడాయన.

“బాబుగారూ! నా వయసు పధ్నాలుగు. మామూలుగా అయితే అన్ని పెళ్ళిళ్ళు చేయించాం ఇన్ని శుభకార్యాలు చేయించాం అని గర్వంగా చెప్పుకోవచ్చు. మరి ఇటువంటి కార్యక్రమంలో అటువంటి మాటలు చెప్పడం భావ్యం కాదు కాబట్టి చెప్పను. కానీ నాకు మంచి అనుభవమే ఉంది. మరి నాన్నగారు వేరేచోటికి వెళ్ళారు. ఇదుగో మా అన్నయ్యకూడా వచ్చాడుగా” అన్నాడు.

అవడానికి అన్నే అయినా తమ్ముడి ముందర నాసిగానే వున్నాడు.

“ఆ! చెప్పండి సార్. ఎప్పుడు పోయారు?” అడిగాడు బాలక్రిష్ణ.

“తెల్లవారు ఝామున మూడింటికి” చెప్పారు ఎవరో!

"ఆషాఢమాసం, మంగళవారం అమావాస్య. అబ్బో చాలా తతంగం వుంది. మరి ఏమిటి? ఎవరైనా రావాలా? వీరికి కుమారులున్నారా? ఉపనయనం అయిందా అబ్బాయికి?" అంటూ నేరుగా రంగంలోకి దిగిపోయాడు బాలక్రిష్ణ.

"అదికాదబ్బాయ్. ఎంత తీసుకుంటారు ఏమిటి? ఆ విషయాలు మాట్లాడాలి కదా!" అన్నాడు చుట్టాల్లోని ఓ పెద్దమనిషి.

"అవన్నీ సాయంత్రం నాన్నగారొచ్చి మాట్లాడతారు" అన్నాడు.

"అదెట్లా? ముందే ఓ మాట అనుకోవాలి లేకపోతే తర్వాత పేచీలొస్తాయ్" అన్నాడాయన.

"చూడండి బాబుగారూ మేం అడిగినంతా మీరూ ఇవ్వరు. మీరిచ్చిందే మేమూ పుచ్చుకోము. మేము ఓ మాట అంటాం. మీరు ఓ మాట అంటారు. ఎక్కడో ఓ దగ్గర సెటిల్ అయిపోతాం. అంతేకదా! కాదూ కూడదూ అంటారా చెప్పండి. నేను వెళ్ళిపోతాను. మీకు మరో నెంబరిస్తా. వారిని పిలిపించుకోండి" అన్నాడు.

బంధువులూ, బిల్డింగ్‌వారూ మొహామొహాలు చూసుకున్నారు. "జగన్నాథం పేచీపెట్టేమనిషి కాదులెండి. కానివ్వండి" హామీ ఇచ్చాడు సెక్రటరీగారు. సరే అలాగే కానివ్వండి అన్నారు వాళ్ళు.

బాలక్రిష్ణ సెల్‌ఫోన్ తీసి టకటకా నెంబర్లు నొక్కి ఎవరెవరికో పనులు పురమాయిస్తున్నాడు. మరో డొక్కు మోపెడ్‌మీద ఇద్దరు నడివయసువాళ్ళు వచ్చారు.

"వచ్చారా మీకోసమే చూస్తున్నా... వారిదగ్గర డబ్బుతీసుకుని వెళ్ళి సామాన్లు పట్రండి. అనేసి సార్ వీరికి ఓ వెయ్యిరూపాయలు ఇవ్వండి. మరో నాలుగైదువేలు సిద్ధంగా వుంచుకోండి" అని చెప్పాడు.

"నాన్నా! పోయినాయనకి తండ్రి జీవించే వున్నారు. ఏం చేయించాలి?" అని తండ్రిని ఫోన్లో అడిగాడు.

"సార్ వాహకుల విషయం ఏమిటి? మీవాళ్ళు పడతారా? లేకపోతే పిలిపించమంటారా? బన్సీలాల్ పేటా? అంబర్‌పేటలోనా?"

"కరెంటు మిషన్‌లోనా? కట్టెలతో దహనమా?" అంటూ అష్టావధానం చేస్తున్న బాలక్రిష్ణని చూసి అమ్మో వీడు తాటాకు కాదు తాళపత్ర గ్రంథం అనుకున్నాం అందరం.

ఓ పక్క ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోపక్క కబురుతెలిసిన వారంతా వస్తున్నారు. పలుకరింపులూ ఏడుపులూ ఎక్కువయ్యాయి.

"ఒరే అన్నయ్యా నువ్వు బాడీ దగ్గరికి వెళ్ళి స్నానం ఏర్పాట్లు చూడు. మంత్రం అందుకో" అని ఆర్డరేశాడు.

అతను మూటగా కట్టిన శవం దగ్గరికివెళ్ళి మూటగట్టిన దుప్పటి విప్పి కీచుమని అరిచాడు. అటు చూచిన అందరం అదిరిపడ్డాం. నీలం ప్లాస్టిక్ షీట్‌లో చుట్టారు బాడీని. దాని కిందంతా రక్తం. మొహం అంతా రక్తం. కడుపులో తిప్పింది.

ఏమాత్రం చలించని బాలక్రిష్ణ ఒక్కడే... "ఏవిటండీ యాక్సిడెంటా?" అని అడిగాడు.

"కాదు లివర్ పాడైపోయింది" చెప్పారెవరో.

"ఓ అలాగా పాపం! డెత్ సర్టిఫికెట్ పక్కగా వుందిగా! లేకపోతే శ్మశానంలో గొడవ చేస్తారు. ఏ హాస్పిటల్లో పోయారు?" మరో ప్రశ్న.

"వాళ్ళు డెత్ సర్టిఫికెట్ ఇచ్చారంటే ఇక తిరుగులేదులెండి. ఏదీ నాకోసారి చూపించండి" అన్నాడు.

వెంటనే సర్టిఫికెట్ తెచ్చి చూపించారు. "ఆ కరెక్ట్‌గానే ఉంది... ఓ పది జిరాక్సులు తీయించి పెట్టుకోండి. ఒరిజినల్ జాగర్త చెయ్యండి" అనేసి అన్నవంక చూశాడు.

ఆ అన్నగారింకా తేరుకోలేదు. "ఒరే క్రిష్ణా మరీ! నాకూ!" అని నీళ్ళు నములుతుంటే అడ్డుకున్నాడు. "నాకు తెలీదుట్రా నీ సంగతి. శవంకూడా పద్ధతిగా వుండాలి నీకు. కాస్త అటూ ఇటూ అయితే కళ్ళుతేలేస్తావ్. ఈ వ్యవహారం నీవల్ల కాదు గానీ నువ్వెళ్ళి ఆత్మబంధువు ఎక్కడుందో చూడు అని వేరేపని అప్పచెప్పి అతన్ని తోలేశాడు.

షర్టు విప్పి పొందికగా ఓ మూల పెట్టి తుండుగుడ్డ నడుముకి కట్టుకున్నాడు. ఓసారి మిస్సుడుకాల్స్ చూసుకుని సెల్ పక్కన పెట్టాడు. అయ్యా చూస్తున్నారుగా. స్నానం చేయించే పరిస్థితి కాదు. వూరికే నీళ్ళు చల్లాలి. అని పెద్దవాళ్ళకి చెప్పాడు.

ఏడుస్తున్న కొడుకు దగ్గరికి వెళ్ళాడు. "అబ్బాయిగారూ! మీరిక లేవాలి. గుండె రాయి చేసుకోండి. మరి మీ నాన్నగారిని శ్రద్ధగా పంపించాలి" అని భుజం తట్టాడు.

"అమ్మా! పెద్దవారెవరైనా ఇటురండి. ఈయనకి కాస్త కాఫీ ఇవ్వండి. బోలెడంత పనుంది ముందర. కాఫీ తాగి స్నానం చేసి రండి బాబూ మీరు" అన్నాడు.

శవం పక్కనే కూర్చుని ఏడుస్తున్న ఆడవాళ్ళను "అమ్మా మీరిహ తప్పుకోవాలి. కాస్త పక్కగా కూర్చోండి. అయిపోయింది. ఇంకేముందమ్మా ఏడవడానికి? మనసు దిటవు పరచుకోండి! అన్నాడు.

ఇటువైపుకొచ్చి వెదురుబొంగులకి పాడెకడుతున్నవాళ్ళను అజమాయిషీ చేశాడు. "ఓరి నీ మొహం సంతకెళ్ళా! ఇంకాసిని బొగ్గులెక్కువెయ్యరా. మరీ గేటు దాటకుండానే నిప్పులారిపోతే ఎట్లా?" అని నిప్పు రాజేస్తున్నవాడిని మందలించాడు.

"ఆ అయిందా అబ్బాయిగారూ స్నానం! ఇలారండి. ఇక్కడ కూర్చోండి" అని కూర్చోబెట్టి ఓ పక్క తనూ కూర్చుని మంత్రం అందుకున్నాడు. ఖంగున కంచు గంటలా మోగుతోంది ఆ కంఠం.

ఎక్కడా దాటవేయకుండా యథావిధిగా సాగిస్తున్నాడు. నోట్లో బియ్యం వేయించాడు. ప్రదక్షిణలు చేయించాడు. శవాన్ని వేన్‌లో ఎక్కించారు. ఏడుపులు గగ్గోలుగా వుంది.

"చూడండమ్మా ఇదంతా కడిగించెయ్యండి. ఈ చాపా దుప్పటీ ఇవన్నీ బయట పారేయించండి. ఇంట్లో దీపం పెట్టాలి. మరి భోజనాల మాటేవిటీ? ఎవరైనా గుప్పెడు ఉడకేసే వాళ్ళున్నారా? లేకపోతే చెప్పండి. ఆ ఏర్పాటు చేస్తా... ఫోన్‌చేస్తే వండి పట్టుకొస్తారు. అని చెప్పేసి షర్టు వేసుకుని స్కూటరు వెనకసీటుమీద కూర్చున్నాడు.

"అక్కడినించీ బయలుదేరగానే ఫోన్ చేస్తా. దీపం పెట్టి రెడీగా వుంచండి. ఈ పూట కార్యక్రమం ఇంతే. సాయంత్రం నాన్నగారొస్తారు" అని చెప్పేసి వెళ్ళిపోయాడు.

నాకు చాలా బాధ కలిగింది. ఆ పిల్లాడి వయసేమిటి? అతను చేస్తున్న పనేమిటి? హాయిగా ఆడుతూపాడుతూ చదువుకోవాల్సిన వయసులో అపరకర్మలు చెయ్యడమా? ఆ పసివాడి బాల్యాన్ని హరించివేస్తున్న జగన్నాథంగారిమీద చాలా కోపం వచ్చింది. నిలబెట్టి కడిగేయాలనిపించింది. పోలీసులకి రిపోర్టు

చెయ్యాలనిపించింది. అలా చేసేముందు ఈ వ్యవహారం అంతా బాలకార్మిక నిర్మూలన పరిధిలోకి వస్తుందా లేదా అని సందేహం కలిగింది. ఒకరిద్దరిని అడిగాను. ఏమో మరి అని బుర్ర గోక్కున్నారు.

సాయంత్రం వాకింగ్‌కని కిందికి దిగాను. బిల్డింగ్ చుట్టూ ఖాళీగానే వుంటుంది. ఓ పక్కన నాలుగైదు బెంచీలు వుంటాయి. వాకింగ్ చేసి అక్కడే కాసేపు కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ వుంటారు అందరూ. ఆ బెంచీమీద ఓ కొత్తమొహం కనిపించింది. జీన్స్ పేంటూ, టీ షర్ట్... సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుకుంటున్నాడు ఓ కుర్రాడు. ఎక్కడో చూసినట్లే వుంది.

ఎవరా అనిచూస్తే బాలక్రిష్ణ. ఆహార్యం పూర్తిగా మారిపోయేసరికి గుర్తుపట్టలేక పోయాను వెంటనే. "ఏవిటి బాబూ ఇటొచ్చావ్" అని పలుకరించా!

గేమ్ ఆపేసి వినయంగా లేచి నిలబడ్డాడు. "నాన్నగారు వచ్చారు వారితో మాట్లాడ్డానికి. ఆయనతో వచ్చా! ఆయనకి బి.పి. ఉంది. ఒంటరిగా పంపించొద్దంటుంది అమ్మ" అన్నాడు.

నీకేమో నీ తండ్రంటే ఇంత ప్రేమాభిమానాలు. మీ నాన్న నీకెంతో అన్యాయం చేస్తున్నాడు అనుకున్నా. ముందు ఈ అబ్బాయికీ ఆ తర్వాత జగన్నాథానికీ బ్రెయిన్ వాష్ చెయ్యాలి అనుకున్నా. నచ్చజెప్పి చదువులో పెట్టిస్తే రాణిస్తాడు. జీవితంలో పైకొస్తాడు. ఈ శవదహనాలూ, అస్థినిమజ్జనాలూ వీటినుండి బయటపడతాడు అనుకున్నా.

పక్కనున్న బెంచీమీద కూర్చున్నా. సంభాషణ ఎలా మొదలు పెట్టాలో అర్థం కాలేదు. నువ్వేం చదువుకున్నావు బాలక్రిష్ణా అని అడిగా. "టెంత్ అమ్మగారూ" అన్నాడు.

"మరెందుకు మానేశావ్?" అని అడిగా.

"మానెయ్యలేదండీ చదువుకుంటున్నాగా?" అన్నాడు.

మరి బడి మానేసి ఈ పన్లు ఏమిటి అని అడగాలనుకుంటూ వుండగానే ఒకాయన లోపలికొచ్చాడు. బాలక్రిష్ణని చూసి "వున్నారా నాయనా నువ్వూ మీ నాన్నానూ?" అని వుసూరుమంటూ బాలక్రిష్ణ పక్కన చతికిలపడ్డాడు.

"వచ్చావా మామయ్యా!" పలుకరించాడు బాలక్రిష్ణ.

"మామయ్యా మట్టిగడ్డానూ. నువ్వూ మీ నాన్న కలసి నన్ను ముంచేస్తున్నారు కదురా!" ఆక్రోశించాడాయన.

యాభై ఏళ్ళుంటాయేమో. బక్కపలచగా వున్నాడు. "ఏం ముంచేశాం? బాగానే వున్నావుగా ఠింగురంగామనీ" అన్నాడు బాలక్రిష్ణ నవ్వుతూనే. "ఈ వెటకారాలకేంలే! ఎందుకురా నన్నిలా ఏడిపిస్తారూ?" ఏడుపొక్కటే తక్కువ ఆయనకి.

నాకంతా అయోమయంగా వుంది. హఠాత్తుగా ఛానెల్ మారిపోయింది. కథ మలుపు తిరిగింది. అనుమానం కలిగింది. చెవులప్పగించి జాగర్తగా వినసాగాను.

"ఏం ఏడిపించాం మామయ్యా" నవ్వుతూనే అడిగాడు.

"లాయరుగారింట్లో రేపు పదోరోజున దానాల్లో నాకు ఇంకేదైనా ఇప్పించమంటే ఈసారీ ఉప్పూ మేకూనే కేటాయించాడుగా మీ నాన్న. ఇదేమైనా బావుందిట్రా! ఎంతకాలం ఈ స్థితిలో వుంటానురా! గట్టిగా మాట్లాడదామంటే మీ బావని చూస్తే భయం. అతన్తో గొడవపడటం అంటే నీటిలో నిలబడి మొసలితో వైరం తెచ్చుకున్న చందం అయిపోతుంది. ఏం చెయ్యన్రా? నన్నెందుకిలా క్షోభపెడుతున్నారు మీరంతా కలిసి" అన్నాడాయన దీనాతిదీనంగా.

అంతా విని ఆదరంగా అతనివీపుమీద చెయ్యివేశాడు బాలక్రిష్ణ. "ఏవిటి మామయ్యా నీ బాధ. ఉప్పు, ఇనుమూ దానం పడుతున్నాననే కదా!"

"అవున్రా అందరూ హీనంగా చూస్తున్నారు. ఈ పిచ్చిదానాలు పట్టే స్థితికి దిగజారానని నా మనసు దహించుకుపోతోంది".

ఫక్కున నవ్వేశాడు బాలక్రిష్ణ. "మావయ్యా అసలు దానాలు పట్టేస్థితికి వచ్చినందుకు ఏడిచినా అర్థం వుందిగానీ అందులో ఈ దానం పట్టినందుకు ఏడుపా?" అన్నాడు.

"చిన్నపిల్లాడివి నీకేం తెలుసురా. మామూలు దానాలకీ శనిదానానికీ తేడా లేదా? ఇహ నావల్ల కాదురా! రానీ మీ నాన్నని కడిగేస్తా! మీ ఇంటికే వద్దామను కుంటున్నా. ఇక్కడకొస్తా రమ్మన్నాడు. జీవితాంతం ఈ దానాలే పట్టాలని రాసి వుందిట్రా?" నిలదీశాడు.

"ఉన్నా అదీ నీ అదృష్టం. అనుకో మావయ్యా. ఆవేశం పక్కన పెట్టి శాంతంగా ఆలోచించు. ఈ దానాలు పట్టేవాళ్ళు ముగ్గురే వున్నారు మన చేతిలో. సూర్యం తాతయ్యా పోనేపోయాడు. చిట్టిపంతులు కొడుకు దగ్గరికి వెళ్ళిపోయే ఆలోచనలో వున్నాడు. మిగిలింది నువ్వు. నీదే రాజ్యం. ఇటువంటి క్రతువు ఎక్కడ జరిగినా కాంతయ్య ఏడీ వున్నాడా అని నిన్ను ఖాయం చేసుకుని మిగిలినవారిని వెతుక్కుంటారు.

ఇక జనం ఆక్షేపిస్తున్నారంటావా? ఆ ఆక్షేపించేవాళ్ళు నీకు అన్నం పెడతారా? వాళ్ళ ఖర్మానికి వాళ్ళ నొదిలెయ్" అన్నాడు బాలక్రిష్ణ.

"ఒడ్డున కూచున్నవాడివి నీకేం? ఎన్ని కబుర్లైనా చెప్తావు. మీ నాన్న మహర్జాతకుడు. మీ బావని చూడబోతే దళం వేసుకుని మరీ పుట్టాడు. నాబోటివాడు తలెత్తి చూడలేనంత ఎత్తుకి ఎదిగిపోయాడు. ఎలాగైనా మీరంతా అదృష్టవంతుల్లేరా" అసూయ ధ్వనించింది ఆయన గొంతులో.

"అన్యాయంగా మాట్లాడకు మావయ్యా. ఎంతకష్టపడితే ఈ స్థాయికి ఎదిగారు మా నాన్నా, బావానూ! స్వంత ఊళ్లో శివాలయంలో అభిషేకం చేసుకుంటూ సత్యనారాయణ వ్రతాలూ, వరలక్ష్మీ వ్రతాలూ చేయించిన మా నాన్న, అందరూ వలసపోయి ఊరు ఖాళీ అయిపోయి పూటగడవని స్థితిలో దేవుడికే ధూపదీప నైవేద్యాలు గడవడం లేదు ఇక నాకేం జరుగుతుంది అని కడుపుచేత బట్టుకొని ఈ ఊరొచ్చారు.

"ముగ్గురం చిన్నపిల్లలం. శుభకార్యాలు చేయించే అవకాశం దొరక్క అపరకర్మలు మొదలుపెట్టారు. అందుకాయనా బాధపడలేదు. ఆలయంలో దేవుడికి మహానైవేద్యం వండి పెట్టిన చేతుల్తో తద్దినం వంట ఎలా చేస్తానని అమ్మా బాధపడలేదు. నాన్న మంత్రం, అమ్మవంటా, అన్నయ్య భోక్త అలానెట్టుకొచ్చారు. మరి అప్పుడు అందరూ నానా మాటలూ అన్నారు. అవేం పట్టించుకోలేదు నాన్న. మెల్లిగా నిలదొక్కుకున్నారు.

"బావమరిదినీ పిలిపించుకున్నారు. ఇప్పుడు అన్నీ అమెరికా వాళ్ళ కేసులే చూస్తాడనీ కార్లో తిరుగుతారనీ బావని చూసి అసూయ పడతారుగానీ మొదట్లో అతనెంత కష్టపడ్డాడు? ఎండలో కాళ్ళకి చెప్పులు కూడా లేకుండా తిరగటం నాకు గుర్తే. నేను చేస్తున్న పని గొప్పదే అనే ఆత్మవిశ్వాసంతో వృత్తిపట్ల గౌరవంతో కృషి

చేశాడు కాబట్టి అదృష్టం తలుపుతట్టింది. తను బాగుపడి వూరుకోలేదే. నీ బోటి వాళ్ళను అందర్నీ పిలిపించి ఆశ్రయం ఇచ్చాడు పని కల్పించాడు.

"పెళ్ళయ్యాక అక్కా బావా కలిసి ఈశ్వర సేవా సమాజం ప్రారంభించారు. ఇంట్లో వసతి లేక ఆబ్దికాలు పెట్టలేని వారందరికీ అక్కడ పెట్టే వీలు కల్పించాడు. ఏ మాత్రం అటూ ఇటూ కానివ్వడు. ఎదురుగా మనుషులుంటే ఎంత శ్రద్ధగా ఆ కార్యక్రమం జరిపిస్తాడో అమెరికానుంచీ ఫోన్ చేసి జరిపించమన్నా అంత శ్రద్ధగానూ చేయిస్తాడు.

"ఆరేళ్ళ క్రింతం నాకు ఒడుగు చేశారు. అప్పుడే బావ నన్ను దగ్గర కూర్చోబెట్టుకుని హితవు చెప్పాడు. చదువాపకు. చదువుకుంటేనేం ఈ పనీ నేర్చుకో. ముందు ముందు ఏం చెయ్యాలో సమయం వచ్చినప్పుడు నిర్ణయించవచ్చు అన్నాడు.

"అలాగే అన్నీ నేర్చుకున్నా. ఇప్పుడు నా భవిష్యత్తు నిర్ణయించేసుకున్నా. నాన్నగారి బిజినెస్ బ్రహ్మాండంగా వుంది. అన్నయ్య అర్భనాకారివాడు. పక్కవాయిద్యంలా పక్కనుండాల్సిందేగానీ ధైర్యమూ చొరవా లేవు. ఏదో చదువూ ఉద్యోగం అంటూ పరుగులు పెట్టే బదులు వడ్డించిన విస్తరిలా వున్న ఈ దారిన నడవటం మంచిదనుకున్నా! చదువు మానలేదు. గవర్నమెంటు కాలేజీ. ఎన్నిరోజులు దుమ్మాకొట్టినా అడిగేవాడుండడు. కాస్త కంప్యూటర్ జ్ఞానం కూడా సంపాదించుకున్నా.

"ఇదంతా ఎందుకు చెప్పానంటే నువ్వు చేసేపనిని ఓ తపస్సులా చెయ్యి. ఉప్పూ మేకూ హీనమైన వస్తువులని అనుకోకు. బంగారం పుట్టిన భూమినుంచే ఇనుమూ పుట్టిందనుకో. ముత్యం పుట్టిన సముద్రం నుంచే ఉప్పూ పుట్టిందనుకో. ఆ దేవుడు నాకీ పాత్రనే కేటాయించాడనుకో. నీకే ధైర్యం వస్తుంది. సంతోషంగా దానం పట్టు. దానమిచ్చినవాడిని మనస్ఫూర్తిగా దీవించు. వారిని సంతోషపెట్టాక కావలిస్తే మరికాస్త దక్షిణ ఎక్కువ ఇమ్మను. రుసురుసలాడుతూ అసహనంగా అడిగితే విసుక్కుంటారు గానీ అడిగేతీరున అడిగితే ఆనందంగా ఇస్తారు. ఈ ఫీల్డులో స్థిరపడిపో. అంతేకాదు ఇంకోమాట కూడా చెప్తున్నా. నీ కొడులిద్దర్నీ కూడా ఇటు మళ్లించు".

"ఏవిటీ వాళ్ళనా? వాళ్ళని బాగా చదివించాలని వుంది నాకు!" ఆగ్రహంగా అన్నాడాయన.

ఏం చదివిస్తావ్? డిగ్రీ గట్టెక్కిస్తే గొప్ప. ఆ డిగ్రీ ఎందుకూ పనికిరాదు. ఇంకా పై చదువులు నువ్వు చదివించలేవు. రెంటికీ చెడ్డ రేవడిలా అవుతుంది వాళ్ళపని. నా మాట విని వాళ్ళనీ నీ చేతికింద పెట్టుకో. ఒకరికి ముగ్గురవుతారు. ఇక ఈ దానానికి మీదే ఆధిపత్యం. నీ మంచికోరి చెప్తున్నా. చదువు కావాలంటే ప్రైవేటుగా చదివించు. ఇది మాత్రం వదులుకోకు. మబ్బుని చూసి ముంతలో నీళ్ళు ఒలకబోసుకోడం అవివేకం. నాన్నకి నువ్వంటే అభిమానం కాబట్టి ప్రతిసారీ నువ్వు సాధిస్తున్నా వూరుకుంటున్నారు. ఆయన విసిగిపోయి వద్దుపొమ్మంటే దర్భపోచకు సరితూగవు. జాగర్త మరి!"

అతని హితబోధకి నాకు తల తిరిగిపోయింది. ఆ కాంతయ్యగారికీ బుర్రలో బూజు వదిలిపోయినట్లుంది.

"బాలక్రిష్ణా నువ్వు సామాన్యుడివి కాదురా! అఖండమైన తెలివితేటలున్నాయి. మీ నాన్ననీ, బావనీ మించిపోతావు. నాకే ఓ కూతురుంటే నీకిచ్చి పెళ్ళి చేసేవాడిని" అన్నాడు.

"ఈ వయసులో ఏం కష్టపడతావులేగానీ పెళ్ళయ్యాక నా భార్యనే నీ కూతురనుకో" నవ్వేశాడు కుర్రాడు.

దిగులు తీరిపోయిందేమో నిశ్చింతగా లేచాడాయన "వెళ్ళొస్తాన్రా మరి! పెందలాడే లాయరుగారి ఇంటికొస్తానని మీ నాన్నతో చెప్పు" అనేసి వెళ్ళిపోయాడు.

మళ్ళీ పంచదారా బొమ్మా బొమ్మా అని పాడుతూ సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుకోటం ప్రారంభించాడు బాలక్రిష్ణ.

జగన్నాథం మా బిల్డింగ్ సెక్రటరీగానూ అక్కడికొచ్చారు.

"సరే జగన్నాథంగారూ! మీకు చెప్పాల్సిన పనిలేదుగానీ ఏదో నా విధిగా చెప్తున్నా. అన్నీ జాగర్తగా జరిపించండి" అనేసి వెళ్ళిపోయాడు సెక్రటరీగారు.

"పదరా బాలక్రిష్ణా" అన్నాడు జగన్నాథం.

"నాకు పిజ్జా కొనిస్తానన్నావుగా" మారాం చేశాడు బాలక్రిష్ణ.

"ఇప్పుడు పిజ్జా ఎందుకురా! ఇంట్లో బోలెడన్ని వుంటేనూ!" అన్నాడు జగన్నాథం. బాలక్రిష్ణ విన్లేదు. మారాం చేశాడు మంకుపట్టుపట్టాడు. చివరికెలాగైతేనేం

సాధించాడు. రెండొందలు తీసుకుని తుర్రున పారిపోయాడు. "త్వరగారా!" వెనకనించీ తండ్రి హెచ్చరించాడు.

బెంచీమీద కూర్చున్నాడు జగన్నాథం. ఎదురుగా నేను కనిపించాను. అందుకే నాతో చెప్పడం మొదలెట్టాడు.

"ఆటకాయితనం ఇంకా పోలేదు. బొత్తిగా కుదురులేదు వెధవకి. కుర్రచేష్టలూ వీడూనూ! ఎప్పటికి ఓ దారినపడి కాస్త లోకజ్ఞానం అలవరుచుకుంటాడో" అన్నాడు.

నాకు నవ్వొచ్చింది. వీడా కుర్రాడు? వాడి విశ్వరూపం చూస్తే హడలిపోతారు. మీ క్షేమంకోరి మీ ఎదుట ఇలా అల్లరి చిల్లరిగా ఏమీ తెలియనట్లు వుంటున్నాడు" అనుకున్నా.

పిజ్జా తినేసి వచ్చాడు బాలక్రిష్ణ. "చిల్లరేదిరా!" అని అడిగాడు జగన్నాథం. "ఏం చిల్లరా! నా దగ్గరున్న డబ్బు కూడా వేస్తేగాని సరిపోలేదు అన్నాడు బాలక్రిష్ణ. "ఏవిటంత ఖరీదా? ఎందుకురా" అని ఆశ్చర్యపోయాడాయన.

"అబ్బో అది చాలా పెద్ద విషయం. మీకు చెప్పినా అర్థం కాదు గానీ పదండి" అన్నాడు నవ్వుతూనే.

స్కూటరు స్టార్టు చేశాడు జగన్నాథం. "అబ్బా ఈ ట్రాఫిక్‌లో స్కూటరు నడపాలంటే విసుగొచ్చేస్తోందిరా. అన్నయ్యుంటే వాడేనడుపుతాడు. నీక్కూడా వయసొస్తే లైసెన్సొస్తుంది. అపుడు నాకీ డ్రైవింగ్ బాధ తప్పుతుంది" అన్నాడు.

"ఇప్పుడు మాత్రం ఏం? మీరు వెనక్కూర్చోండి. నేను నడుపుతాను!"

"ఆ! అప్పుడుగానీ ఏ పోలీసో పట్టుకుని జైల్లో పెట్టడు" అన్నాడు జగన్నాథం.

"ఆ! ఏం పెట్టడు. పట్టుకోగానే అయ్యా మన్నించాలి. శ్మశానానికెళ్లే హడావిడిలో లైసెన్సు మర్చిపోయాగానీ నా వయస్సు పందొమ్మిది. శవాన్ని తగలేసి ఇంటికెళ్తున్నాం. అంటే చాలు అదిరిపడి తప్పుకుని దారిచ్చేస్తారు. రౌడీలకీ కేడీలకీ భయపడని వాళ్ళు కూడా మనని చూసి భయపడతారు నాన్నా!" అన్నాడు బాలక్రిష్ణ.

"చాల్లే నోరు మూసుకో. వెధవ వాగుడూ నువ్వూనూ. నేను నడుపుతా. మెయిన్‌రోడ్డు కాకుండా సందులూ గొందులూ నీకు బాగా తెలుసుగా దారి చెప్పు" అన్నాడు జగన్నాథం.

"అలాగే పితాశ్రీ పదండి!" అని వెనకాల కూర్చున్నాడు బాలక్రిష్ణ. స్కూటరు వెళ్ళిపోయింది.

బాలక్రిష్ణను బాలకార్మికుడుగా భావించి జాలిపడ్డందుకు సిగ్గేసింది.

తనపట్ల జాలిలేదు. అయ్యో ఈ కులంలోనే ఎందుకు పుట్టాను అన్న దుగ్ధ లేదు. ఎదుటివారిని చూసి ఏడిచే బలహీనత లేదు.

వాడు యోగి. బతకనేర్చినవాడు.

గీతలో భగవంతుడు చెప్పినట్లు వీడు పరమాత్మకు అత్యంత ప్రియమైనవాడు. ❑

*సాహితీ స్రవంతి- కథకి నీరాజనం పోటీలో బహుమతి పొందిన కథ*

*సాహితీ స్రవంతి, నవంబరు-డిసెంబరు 2011*